





## పలువురు అధికారులకు స్థానచలనం

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారుల బదిలీలు చేపట్టింది. సిద్దిపేట జిల్లా అడిషనల్ డీఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్ నిజామాబాద్ అడిషనల్ డీఆర్డీవోగా బదిలీ అయ్యారు. అక్కడ డీఆర్డీవో విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ సిద్దిపేటకు రానున్నారు. అడిషనల్ డీఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న మరో అధికారి కౌసల్యదేవి వరంగల్ డీఆర్డీవోగా బదిలీ అయ్యారు. ములుగు జిల్లాలో అడిషనల్ డీఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ సిద్దిపేట జిల్లాకు రానున్నారు. ఏపీడీగా విధులు నిర్వర్తిస్తున్న బాలరాజు సంగారెడ్డి ఏపీడీగా బదిలీ అయ్యారు. ఏపీడీగా విధులు నిర్వర్తిస్తున్న మరో అధికారి చిన్న ఓబులేసు నాగర్‌కర్నూల్ డీఆర్డీవోగా బదిలీ అయ్యారు. గజ్వేల్ డీఎల్‌పీవోగా విధులు నిర్వర్తిస్తున్న వేదవతి వరంగల్ డీఎల్‌పీవోగా బదిలీ కాగా.. హుజురాబాద్ డీఎల్‌పీవో విధులు నిర్వర్తిస్తున్న లతశ్రీ గజ్వేల్ డీఎల్‌పీవోగా బదిలీ అయ్యారు. అలాగే హుస్నాబాద్ డీఎల్‌పీవోగా విధులు నిర్వర్తిస్తున్న వీరభద్రయ్య భూపాలపల్లికి బదిలీ కాగా నర్సంపేటలో డీఎల్‌పీవోగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేష్ హుస్నాబాద్ డీఎల్‌పీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.





### భూమికి పచ్చాని.. రంగేసినట్టు..

సిద్దిపేట జిల్లాలో యాసంగిలో రైతులు సాగు చేసిన వరి పైరు ఏపుగా పెరిగింది. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామ శివారులో రైతులు సాగు చేసిన పచ్చని వరి పాలాలను చూస్తుంటే భూమికి పచ్చని రంగు అద్దినట్లుగా దర్శనమిస్తున్నాయి.

\- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

### ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్
- మూడు జిల్లాల కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'
- అర్జీదారుల నుంచి వినతుల వెల్లువ

7వ పేజీ

### తక్కువ ధరకు కెమెరాల పేరుతో మోసం

- సైబర్ నేరస్థుడు సూరజ్ అరెస్ట్
- కేసు వివరాలను వెల్లడించిన సిద్దిపేట సీపీ


7వ పేజీ

### మాటు వేసి బండరాయితో మోది

- భూవివాదంలో బావ దారుణ హత్య
- పోలీసుల ఎదుట లొంగిపోయిన బామ్మర్ది

### సరస్వతీ క్షేత్రంలో బ్రహ్మోత్సవ వైభవం

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు



కొమురవెల్లి స్టేషన్ ఆవరణలోని రైల్వేట్రాక్

# 'మల్లన్న' చెంత రైల్వే హాల్ట్ స్టేషన్

కొమురవెల్లి శివారు కొండపాక స్వాగత తోరణ సమీపంలో ఏర్పాటు

- 15న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో భూమిపూజ
- హాజరుకానున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్
- త్వరలోనే టెండర్ల ప్రక్రియ
- వచ్చే జాతరలోగా అందుబాటులోకి..!

చేర్యాల, ఫిబ్రవరి 12: కొమురవెల్లి మల్లన్న భక్తుల కోర్కె ఎట్టకేలకు నెరవేరనున్నది. కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా మల్లన్నస్టేషన్ ఏర్పాటుపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. రాజీవ్ జాతీయ రహదారి కొండపాక స్వాగత తోరణం సమీప ప్రదేశం గుండా ఆలయానికి చేరువన, కొమురవెల్లి శివారులో రైల్వే హాల్ట్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల స్టేషన్ ప్రతిపాదిత స్థలం ఖరారు కావడంతో ఈనెల 15న భూమిపూజ చేపట్టనున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ హాజరుకానున్నారు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు భూమి పూజ నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లను సోమవారం చేపట్టారు. రైల్వేలైన్‌ను అనుకుని ప్రతిపాదిత స్థలాన్ని చదు ను చేయిస్తున్నారు.




రైల్వేస్టేషన్ల రూట్‌మ్యాప్



భూమిపూజకు శిలాఫలక గద్దెను నిర్మిస్తున్న సిబ్బంది

#### ఎన్నో విజ్ఞప్తులు

కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ కొమురవెల్లి మీదుగా చేపట్టినా సమీపంలోని లకుడారం, దుద్దెడలో స్టేషన్‌లు ఖరారు చేశారు. మల్లన్న ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో కొమురవెల్లిని రైల్వేస్టేషన్ల జాబితాలో చేర్చాలని భక్తులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మాజీ మంత్రులు, ప్రస్తుత మంత్రులు రైల్వేఅధికారులకు విన్నవించారు. గవర్నర్ తమిళిసై, బీజేపీ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రూపాలా, మాజీ ఎంపీలు బండి సంజయ్‌కుమార్, బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు హామీ ఇచ్చారు. కానీ, సాంకేతిక కారణాల వల్ల అమలుకు నోచుకోలేదు. కొన్నినెలలక్రితం కరీంనగర్ మాజీ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఢిల్లీలో రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కేంద్ర మంత్రి స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని ఆయన రైల్వే శాఖ అధికారులను ఆదేశించడంతో కదలిక వచ్చింది. అంతకు ముందు దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం లోకేశ్ వైష్ణవ్ మల్లన్న ఆలయాన్ని సందర్శించి స్టేషన్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన చేశారు. కానీ, ప్రతిపాదిత రైల్వేలైన్ స్కిప్పర్ జోన్ పరిధిలో ఉండటంతో రైల్వేబోర్డు అనుమతి తప్పనిసరైంది. ప్రతిపాదనలు పంపించినా జాప్యం నెలకొనడంతో ఢిల్లీలోని బీజేపీ జాతీయ మహిళా మోర్చా నాయకురాలు ఉషా బాజ్‌పాయ్ ప్రత్యేక శ్రద్ధ వహించి అనుమతులు వేగవంతం చేయించారు. అయితే మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో మల్లన్న హాల్ట్‌స్టేషన్ క్రెడిట్ పొందాలని రాజకీయ పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి.

మనోహరాబాద్ నుంచి 55వ మైలురాయి, సిద్దిపేట నుంచి 21వ మైలు రాయి ప్రాంతమైన కొమురవెల్లి శివారులో ఈనెల 15న భూమిపూజ చేసిన అనంతరం ప్రత్యామ్నాయ చర్యలు వేగవంతం చేయనున్నారు. స్టేషన్ నిర్మాణ

**వచ్చే డిసెంబరు నాటికి అందుబాటులోకి**

వ్యయం ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి ఇతరత్రా చర్యలు మూడు నెలల్లో పూర్తవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. వచ్చే డిసెంబరులో నిర్వహించనున్న మల్లన్న కల్యాణం నాటికి స్టేషన్‌ను అందుబాటు లోకి తీసుకురానున్నారు.

#### సకల సౌకర్యాలు కల్పించేలా..

ప్రతిపాదిత రైల్వేట్రాక్‌కు ఇరువైపులా 20 మీటర్ల చొప్పున రైల్వే స్థలం ఉంది. అలాగే మరి కొంత స్థలాన్ని కూడా సేకరిస్తున్నారు. రైల్వేస్టేషన్ మాదిరిగానే హాల్ట్‌స్టేషన్ లోనూ వసతులు కల్పించనున్నారు. కార్యకలాపాల నిర్వహణకు అనుగుణమైన స్టేషన్ భవనం, ప్రయాణికుల సౌకర్యార్థం హైలెవల్ ప్లాట్ ఫామ్, వెయిటింగ్ హాల్‌షెడ్, షెల్టర్, అప్రోచ్ రోడ్, నీటి సరఫరా తదితర వసతులను సమకూర్చనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

#### మెరుగుపడనున్న రవాణా సౌకర్యం

హాల్ట్‌స్టేషన్ ఏర్పాటుతో భక్తులకు కష్టాలు తప్పడంతో పాటు స్థానికంగా రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. అయితే, ఇక్కడి నుంచి ప్రయాణించే వారు పొరుగు స్టేషన్ టికెట్ ధరను చెల్లించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ తరువాత టికెట్ ధరల్లో మార్పుచేర్పులు జరిగే అవకాశమూ లేకపోలేదు.

# అక్రమాలపై ఉక్కుపాదం

- స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతో కొరడా
- ఇసుక, రేషన్‌బియ్యం రవాణాకు అడ్డుకట్ట
- వ్యభిచార గృహాలు, పేకాట స్థావరాలపై దాడులు
- గంజాయి, డ్రగ్స్‌పైనా ప్రత్యేక దృష్టి
- జిల్లా పోలీసు వ్యవస్థలోనూ ప్రక్షాళన
- బాధ్యతలు చేపట్టిన నెలరోజుల్లోనే తనదైన ముద్ర వేసిన సీపీ అనురాధ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 12: అక్రమదందాలపై ఉక్కుపాదం మోపుతూ.. తనదైన ముద్రవేస్తున్నారు



అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్



సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ

పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ. ఆమె సీపీగా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల్లోనే అనేక అక్రమాలను బట్టబయలు చేశారు. తమ యంత్రాంగంలోని విభాగాలను సమీక్షిస్తూ అనతికాలంలోనే పట్టుసాధించడంలో కృతకృత్యులయ్యారు.

సిద్దిపేట నూతన జిల్లాతోపాటు పోలీస్ కమిషనరేట్‌గా ఏర్పాటైంది. తొలి సీపీగా శివకుమార్, ఆ తర్వాత జోయల్ డేవిస్, అనంతరం శ్వేత బాధ్యతలు నిర్వర్తించారు. అనూహ్యంగా శ్వేతను హైదరాబాద్‌కు బదిలీ చేసి ఆమె స్థానంలో సీనియర్ అధికారి, డాక్టర్ అనురాధను సీపీగా నియమించారు.

#### శాఖలో ప్రక్షాళన

సీపీ అనురాధ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీసు వ్యవస్థలో ప్రక్షాళన మొదలైంది. జిల్లాలోని ప్రధాన సర్కిళ్ల, ఎస్‌హెచ్‌వోలలో బాధ్యతలు నిర్వహిస్తున్న సీఐలకు స్థానచలనం కలిగింది. 10 మంది సీఐలతోపాటు 18 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. దీంతో జిల్లాలో సుదీర్ఘకాలంగా ఉన్న పోలీస్ అధికారులు జిల్లాను వదిలి వెళ్లక తప్పలేదు. సమయపాలన, అవినీతి రహితం, శాంతిభద్రతల విషయాల్లోనూ ప్రత్యేక దృష్టిసారించారు. పోలీసు శాఖలో మార్పులుచేర్పులు మరొక దశ కూడా ఉండబోతుందనే చర్చ జరుగుతున్నది.

#### ఫిర్యాదులపై తక్షణ స్పందన..

ప్రజాసమస్యలు, అక్రమాలతో పాటు పోలీసు యంత్రాంగంపై వస్తున్న ఫిర్యాదులపైనా కమిషనర్ అనురాధ దృష్టిసారించారు. నిత్యం సీపీ కార్యాలయంలోనూ ప్రజలకు సమయాన్ని కేటాయిస్తున్నారు. ఏ సమస్య ఉన్నా డయల్ 100కు కాల్ చేయాలని విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నారు. ఆమె గతంలో సైబర్‌క్రైమ్స్ విభాగంలో డీసీపీగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ అనుభవంతో సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆన్‌లైన్ మోసాలపై అనుమానం రాగానే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచిస్తున్నారు.

#### అక్రమాలపై టాస్క్‌ఫోర్స్

జిల్లాలో అక్రమ దందాలను అరికట్టడానికి నూతన సీపీ వ్యూహరచన చేశారు. అనుకున్నదే తడువుగా టాస్క్‌ఫోర్స్ బృందాన్ని నియమించి అక్రమాల గుట్టు విప్పుతున్నారు. నెలరోజుల్లోనే అనేక దందాలు వెలుగులోకి వచ్చాయి.

- అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 17 వాహనాలను సీజ్ చేశారు. 15 సంఘటనల్లో 24 మంది నిందితులను అరెస్టు చేశారు.
- ఆరు చోట్ల పేకాట స్థావరాలపై దాడిచేసి 36 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.3.10లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.
- గంజాయిపై ప్రత్యేక దృష్టిపెట్టి 6 కేసులు నమోదు చేయడంతో పాటు 12 మంది అరెస్టు చేశారు. 137 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- పేదలకు చేరాల్సిన రేషన్‌బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నవారిపై కొరడా ఝులిపించారు. 6 సంఘటనలను వెలుగులోకి తెచ్చి 131 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి 16 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
- ఇక మద్యం సేవించి వాహనాలు నడిపిన 950 మందిపై కేసులు నమోదు చేశారు.
- గజ్వేల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న రెండు ఇళ్లపై వేర్వేరు సమయాల్లో దాడిచేసి నలుగురు మహిళలతోపాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు.
- అక్రమంగా కలపను తరలిస్తున్న రెండు డీసీఎం వాహనాలను సీజ్ చేశారు.



పట్టుకున్న అక్రమ కలప

# దేశానికి మోదీయే శ్రీరామరక్ష

- అరవై ఏళ్లలో జరగని అభివృద్ధి పదేళ్లలో పూర్తి
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు ఖాయం
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్
- 'కేఆర్ఎంబీ'పై కాంగ్రెస్, బీఆర్ఎస్ దొంగాట
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



గజ్వేల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గజ్వేల్, ఫిబ్రవరి 12: దేశానికి ప్రధానిగా మోదీయే శ్రీరామరక్ష అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని మోదీ ప్రధానిగా పదేళ్లలో చేసి చూపించారన్నారు. రోడ్లు బాగుపడ్డాయని, ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా మారిందన్నారు. అలాగే యూనివర్సిటీలు వచ్చాయని, రక్షణ రంగంలో టాప్‌లో నిలిచిందన్నారు. గ్రామాలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుల కాళ్లను మోదీ కడిగితే ఒక్క కలం పోటుతో 1700 మంది పారిశుధ్య కార్మికులను తొలగించిన వ్యక్తి కేసీఆర్ అని విమర్శించారు. కేసీఆర్ చేసిన పాపాలు ఆయనకే చుట్టుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. పదేళ్లలో తెలంగాణ అభివృద్ధి కుంటు పడిందని గుర్తుచేశారు.

డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచి గెలిచే విధానాన్ని కేసీఆర్ తీసుకువచ్చారని, కేసీఆర్‌తోనే ఆ విధానం పోవడం ఖాయమన్నారు. ప్రజల ఆస్తులకు ప్రజాప్రతినిధులు కేవలం కాపాలాదారులు మాత్రమేనని, తామే యజమానులమని భావిస్తే కేసీఆర్‌కు చెప్పిన బుద్దే ప్రజలు అందరికీ చెబుతారన్నారు. మోదీ ప్రధానిగా ప్రెస్‌మీట్లు పెట్టడని, ప్రగల్భాలు పలకడని, ప్రతీ క్షణం దేశం కోసమే ఆలోచిస్తారని చెప్పారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మోదీ 400 సీట్లతో మూడోసారి ప్రధానిగా విజయఢంకా మోగించడం ఖాయమని ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 15న కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ రైల్వేస్టేషన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

#### పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు

కృష్ణా నీటి జలాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొంగాట ఆడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మోదీ పేరు ఎక్కడా కనిపించవద్దని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) అంశాన్ని లేవనెత్తుతున్నారని, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా ప్రజలంతా మోదీ వెంట ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. అఖండ మెజారిటీతో మోదీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు. వారివెంట మెదక్ పార్లమెంట్ ప్రభారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు యెల్లు రాంరెడ్డి, ఆకుల రాజయ్య, గురువారెడ్డి, మురళీయాదవ్, వెంకటరమణ, నందన్‌గౌడ్, పేర్ల శ్రీనివాస్, బూర్గు సురేశ్, విభీషణ్‌రెడ్డి, కుడిక్యాల రాములు, సాయిబాబు, మనోహర్‌యాదవ్, ఎల్కంటి సురేశ్, మహేశ్, నాగులు, కిరణ్‌కుమార్‌రెడ్డి, గొడుగు రాజు తదితరులున్నారు.

# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- పీఎం విశ్వకర్మ పథకంపై విస్తృత ప్రచారం
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 : జిల్లాలో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లును పకడ్బందీగా చేయాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణకు 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 36,153 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, అందులో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 17,665 మంది విద్యార్థులు, ద్వితీయసంవత్సరం పరీక్షలకు 18,488 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు.

## పీఎం విశ్వకర్మ పథకంపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం పై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ ఓ సరికొత్త పథకమని అన్నారు. చేతి వృత్తుల వారందరి కళా నైపుణ్యం, కాలానుగుణంగా వారి ఉత్పత్తులు వాటి ప్రత్యేకతలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే సదుద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ పథకం కింద జిల్లా పరిశ్రమ కేంద్ర, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపాలిటీ, ఎంఎస్ఎంఈ అధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సంగారెడ్డిలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి అధికారులను కోరారు. సమావేశంలో ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి గోవిందరామ్, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, డీపీవో సురేష్‌మోహన్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాటు వేసి బండరాయితో మోది... భూవివాదంలో బావను చంపిన బామ్మర్ది

● పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు


మునిరొద్దీన్(ఫైల్)

జోగిపేట, వట్‌పల్లి 12 : వారసత్వంగా వస్తున్న భూమిని పంచడం లేదని సొంత బావను మాటు వేసి చంపి అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయిన ఘటన సంగారెడ్డి జిల్లాలోని అలమైపేటలో సోమవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ మునిరొద్దీన్(60)కు అల్మాయిపేట గ్రామ శివారులో రెండు ఎకరాల భూమి ఉన్నది. పంపకాల విషయంలో ఏడాది కాలంగా మునిరొద్దీన్‌కు అతడి బామ్మర్ది గఫురొద్దీన్‌కు మధ్య తగాదా నెలకొన్నది. ఎన్నోసార్లు గ్రామానికి చెందిన పెద్దమనుషుల వద్ద భూమి పంచివ్వాలని గఫురొద్దిన్ బావను బతిమిలడాడు. అయినా మునిరొద్దీన్ వినలేదు. కక్ష పెంచుకున్న గఫురొద్దిన్ బావ మునిరొద్దీన్ చంపేందుకు నిర్ణయించుకున్నాడు. సోమవారం ఉదయం మునిరొద్దీన్ ఇంటి నుంచి పొలం వద్దకు బయలుదేరాడు. అల్మాయిపేట గ్రామంలో 161 జాతీయ రహదారి పక్కకు రాగానే ఓమ్ని వ్యాన్‌లో వచ్చిన దుండగులు ఒక్కసారిగా మునీరొద్దీన్‌పై దాడికి పాల్పడ్డారు. పారతో కొట్టి, బండరాయితో తలపై మోదడంతో మునిరొద్దీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. దాడికి పాల్పడ్డవారు హైదరాబాద్‌కు చెందిన వారుగా స్థానికులు భావిస్తున్నారు. అయితే పథకం ప్రకారం బావ మునిరొద్దీన్‌ను హత్య చేసినట్టు గఫురొద్దీన్ పోలీసులకు లొంగిపోయాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రక్తపు మడుగులో ఉన్న మునిరొద్దీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మునిరొద్దీన్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## తొగిటలో మహిళ హత్య

● క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టిన పోలీసులు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 12: తొగిట గ్రామంలో మహిళ హత్యకు గురైన సంఘటన సోమవారం వెలుగుచూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తొగిట గ్రామానికి చెందిన మంద ఆశయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య సంగమ్మ, రెండో భార్య మంజుల వ్యవసాయం, కూలీపనులు చేస్తూ జీవించేవారు. ఆశయ్య మంజుల ఆదివారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం సిద్దాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం తిరిగొచ్చి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి సంగమ్మ(55) పడుకున్న గదిలో తలభాగంలో తీవ్రంగా గాయమై రక్తం మడుగులో విగతజీవిగా పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ సాయంతో విచారణ చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుంటుంబంలో సంవత్సకాలంగా గొడవలు జరుగుతున్నాయని, కుటుంబీకులే చంపి ఉంటారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

## తక్కువ ధరకు కెమెరాల పేరుతో మోసం

● సైబర్ నేరస్థుడు సూరజ్ అరెస్ట్
● కేసు వివరాలను వెల్లడించిన సిద్దిపేట సీపీ

గజ్వేల్, ఫిబ్రవరి 12 : బ్రాండెండ్ కెమెరాలను తక్కువ ధరకు ఇప్పిస్తానని నమ్మకం కలిగించి సైబర్ మోసానికి పాల్పడుతున్న వ్యక్తిని సిద్దిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. సిద్దిపేట సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన సంగాని బాల్‌రాజును సోషల్‌మీడియా ద్వారా పరిచయం చేసుకున్న సికింద్రాబాద్ బోయినపల్లికి చెందిన డీజే ఆపరేటర్ ధనాల సూరజ్(29) విశాఖపట్నం నుంచి బిల్లు లేకుండా మంచి బ్రాండెడ్ కెమెరాలు తక్కువ ధరకు తెప్పించి ఇస్తానని నమ్మబలికాడు. ఈనెల 16న సూరజ్ బాలరాజుకు ఫోన్ చేసి సోని 7ఆర్-5 డిజిటల్ కెమెరా రూ.50వేలకే ఇస్తానని తెలిపారు. అతని మాటలను నమ్మిన బాలరాజు ఫోన్‌పే ద్వారా రూ.30వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.5వేలు నాలుగు దఫాలుగా పంపించాడు. అనంతరం ఫోన్ స్విచాఫ్ రావడంతో బాలరాజు హైదరాబాద్‌లోని బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు గజ్వేల్ ఏసీపీ రమేశ్, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్, తొగుట సీఐ లతీఫ్, సైబర్ క్రైమ్ సీఐ శేఖర్, బేగంపేట ఎస్ఐ అరుణ్ తన సిబ్బందితో కలసి సూరజ్‌ను పట్టుకున్నారు. సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో సూరజ్‌పై 30 ఫిర్యాదులు అందాయని, అదేవిధంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో ఎనిమిది కేసులు నమోదయ్యాయని, వీటన్నింటిలో మొత్తంగా రూ.4.46 లక్షలను బాధితులు కోల్పోయారని సీపీ తెలిపారు. సూరజ్ గతంలోనూ హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసులో రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలుకు వెళ్లివచ్చినా మార్పు రాలేదని సీపీ పేర్కొన్నారు. నిందితుడి వద్ద రూ.10వేలు, ఒక మొబైల్ స్వాధీనం చేసుకుని తొగుట సీఐ లతీఫ్ రిమాండ్‌కు తరలించారని తెలిపారు. ఇలా దొంగలించిన డబ్బుతో గోవాలో క్యాసినోలో ఆటలు ఆడి ఆ డబ్బును మార్పిడి చేసుకునేవాడని తెలిపారు. అపరిచితులు ఫోన్లలో, ఇతర ప్రకటనల్లో తక్కువ ధరకు ఆశచూపితే నమ్మొద్దని సీపీ తెలిపారు.

## సైబర్ నేరం జరిగితే కాల్ 1930

● సైబర్‌నేరాలపై అవగాహన అవసరం
● ఎస్పీ చెన్నూరి రూపేష్


మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేష్

జహీరాబాద్, ఫిబ్రవరి 12 : ఎవరైన సైబర్ నేరాలతో నష్టపోతే 1930కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై యువతకు అవగాహన అవసరమన్నారు. అమాయక ప్రజల బలహీనతను సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. అత్యాశకు పోయి సైబర్ నేరాల్లో ఇరుక్కుపోవద్దని ఆయన సూచించారు. నేటి సమాజంలో సాంకేతికత ముసుగులో పడి అనేక రకాలుగా నష్టపోతున్నారని ఎస్పీ తెలిపారు. సాంకేతికతను మంచి కోసం వాడితే యువత భవిష్యత్తులో బాగుపడుతారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కష్టపడి చదువుకుని భవిష్యత్తులో ఉన్నతమైన హోదాల్లో ఉండేలా లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమంగా గంజాయి, మత్తుపదార్థాలను రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడంలో పోలీసులు చేస్తున్న కృషికి యువత, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అందరూ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ రోడ్లపై వాహనాలను నడిపాలన్నారు. మహిళల భద్రతే తమ ప్రథమ కర్తవ్యమని ఎస్పీ తెలియజేశారు. ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అశోక్, డీఎస్పీ రఘు, సీఐలు రవి, శివలింగం, వెంకటేష్, విజయ్‌క్రిష్ణ, ఎస్ఐలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12: ఫోక్సో కేసులో ఒకరికి జీవితఖైదు విధిస్తూ మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక పంచముఖి కాలనీకి చెందిన కర్ధకంటి గోపాల్‌పై గతేడాది పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదైందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయాధికారి లక్ష్మీశారద నిందితుడు గోపాల్‌కు జీవితఖైదు, రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్పీ వెల్లడించారు.

## రైల్వేలైన్‌ల తుది సర్వేకు రూ.5.45 కోట్లు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12 : బోధన్ - బీదర్, లాతూర్ రోడ్ - నాందేడ్ రైల్వేలైన్ తుది సర్వే చేసి డీపీఆర్ రూపొందించడం కోసం రూ.5.45 కోట్లు మంజూరు చేస్తూ రైల్వే బోర్డు సంయుక్త సంచాలకుడు అభిషేక్ జగావత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 114.10 కిలోమీటర్ల మేర ఉన్న బోధన్ - బీదర్ రైల్వేలైన్ సర్వేకు రూ.2.85 కోట్లు, 103.90 కిలోమీటర్ల మేర లాతూర్ రోడ్ - నాందేడ్ రైల్వేలైన్ సర్వేకు రూ.2.59 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పాత పంటల్లో ఎన్నో పోషకాలు

● చిరుధాన్యాల సాగుపై దేశ వ్యాప్తంగా ప్రచారం
● డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు

ఝరాసంగం, ఫిబ్రవరి 12 : పాత పంటల్లో ఎన్నో పోషకాలు లభిస్తాయని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) డైరెక్టర్ రుక్మిణీరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులో దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) 24వ పాత పంటల జాతర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు తనకున్న పొలంలో కొంత మేర పాత పంటలైన జొన్న, సజ్జ, రాగులు, ఉలువ, తైద పంటలను సాగు చేసుకోవాలని కోరారు. చిరుధాన్యాల సాగు విధానంపై డీడీఎస్ మహిళ సంఘాల సభ్యులు దేశ వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. అవార్డులు సైతం అందుకున్నారని గుర్తుచేశారు. నాబార్డు డీడీఎం కృష్ణతేజ మాట్లాడుతూ గ్రామాల్లో చిరుధాన్యాల సాగుపై చాటింపు చేయిస్తే రైతులు పాత పంటలను సాగు చేసే అవకాశం ఉందని సూచించారు. సేంద్రియ వ్యవసాయంతో వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందన్నారు. జహీరాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి మాట్లాడుతూ నీటి వసతి కలిగి ఉన్న రైతులు పత్తి పంటను తీసి యాసంగిలో మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేస్తున్నారని, వీటికి బదులుగా పాత పంటలైన సజ్జ పంటను సాగు చేయాలని సూచించారు. పాత పంటల సాగుకు వ్యవసాయ శాఖ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. మాచునూర్ గ్రామం నుంచి డీడీఎస్ వరకు ఎడ్లబండ్లలో స్టాళ్లను ఏర్పాటు చేసి వాటిలో పాత పంటలను నింపి డీడీఎస్ మహిళ సభ్యులు నృత్యాలు చేస్తూ, ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్, తదితర గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వినోద్ పావురాల, కిరణ్, నాబార్డు డీడీఎం తిమోతి, రామాంజనేయులు, నర్సమ్మ, మాణిక్యం, డీడీఎస్ మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు, నృత్యాలు చేస్తున్న మహిళలు

# ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలి

● అధికారులను ఆదేశించిన మెదక్ కలెక్టర్ రాజర్షిషా
● మూడు జిల్లాల కలెక్టరేట్‌లో కొనసాగిన ప్రజావాణి
● అర్జీదారుల నుంచి వినతుల వెల్లువ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12 : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి వినతులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 69 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా ధరణి, భూ సమస్యలు 44, ఉద్యోగం, ఉపాధి 2, పెన్షన్ల 6, ఇతర సమస్యలకు సంబంధించి 17 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి దరఖాస్తులను స్వీరించి బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.


సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు దరఖాస్తు అందజేస్తున్న అర్జీదారులు

### అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 12 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 23 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోని దాసారంగుట్టను కబ్జాపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని కొమురవెల్లి మండల సీపీఎం నాయకులు కృష్ణారెడ్డి, ప్రశాంత్ అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు వినతిపత్రం అందజేశారు.

### సంగారెడ్డి ప్రజావాణికి 65 దరఖాస్తులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు 18 రాగా, ఇతర శాఖలకు సంబంధించినవి 47 వచ్చాయి. మొత్తం 65 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన అర్జీల్లో కొన్ని.. దళితబంధు పథకాన్ని కొనసాగించి రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్‌లను పంపిణీ చేయాలని అందోల్ నియోజకవర్గానికి చెందిన దళితులు కోరారు. సంగారెడ్డి పట్టణంలోని దూద్‌బాయి చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించి చెరువును కాపాడాలని రైతులు ఫిర్యాదు చేశారు. తన ఇంటిని ఆక్రమించుకునేందుకు కొందరు తనపై, కుటుంబీకులపై భౌతిక దాడులు చేస్తున్నారని సదాశివపేట పట్టణ సమీపంలోని సిద్దాపూర్ కాలనీకి చెందిన ఆంజనేయులుగౌడ్ ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని అర్జీలో కోరారు. కంది మండలం ఎర్దనూర్ గ్రామంలో 231 సర్వే నంబర్‌లో క్రషర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకుని సర్కారు భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు సంబంధించిన వ్యవసాయభూమిలో మాదవనేని సుధాకర్ రావు, షేక్ ఉమర్ తమ పొలానికి వెళ్లకుండా అడ్డుగా ప్రహరి నిర్మించాడని కంది మండలం కవలంపేట గ్రామానికి చెందిన సుదర్శన్, శ్రీరాములు, వెంకటేశం, కిష్టయ్య, పద్మమ్మ, గోవర్దన్, హుస్సేన్‌లు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెంటనే స్పందించిన ఆర్డీవో రవీందర్‌రెడ్డి కంది మండలం రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి పొలానికి అడ్డుగా నిర్మించిన గోడలను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

## అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం.. బ్రహ్మోత్సవ వైభవం

నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు



అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం, ఆలయంలో కొలువైన వీణాపాణి సరస్వతీ అమ్మవారు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 12 : చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన అడవి, పచ్చని చెట్లు, పక్కనే చెరువు, ప్రశాంతమైన వాతావరణంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామ శివారులో వీణాపాణియై నిలువెత్తు రూపంలో అమ్మవారు దర్శనమిస్తూ దేశంలోనే మొదటి క్షేత్రంగా విరాజిల్లుతూ భక్తుల పూజలందుకుంటుంది. సరస్వతీ క్షేత్రంలో ఏటా వసంత పంచమిని పురస్కరించుకొని వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. నేటి నుంచి మూడు రోజుల పాటు 34వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా జరగనున్నాయి.

### మూడు దోనెలలో ఎల్లప్పుడూ నీరు

పూర్వం ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన దోనెలు అనే పేరుతో ఎనిమిది నీటి గుహలు అష్టతీర్థములుగా ఉండేవి. ప్రకృతి వైపరీత్యంలో ఐదు కూలిపోగా ప్రస్తుతం రాగి దోనె, చీకటిదోనె, పాలదోనె అను పేర్లతో ఉన్న మూడు గుహలు మాత్రం మిగిలి ఉన్నాయి. ఎల్లప్పుడు ఈ దోనెలలో నీరుండటం విశేషం. ఈ దోనెలలోని నీటితో స్నానాలు చేస్తే దీర్ఘ రోగాలు పోతాయని, మాటలు రాని చిన్న పిల్లలకు మాటలు వస్తాయని, అదేవిధంగా ఈ గుహలలోని నీటిని తీసుకెళ్లి పంటలపై చల్లితే చీడ, పీడలు తొలగునని భక్తుల విశ్వాసం. ఈ నీటి గుహల సమీపంలోనే సిద్దిపేట పట్టణానికి చెందిన అష్టావధాని అష్టకాల నరసింహరామశర్మ 1980 మే 2 న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పదేళ్ల పాటు శ్రమించి ఆలయాన్ని పూర్తి చేశారు. 1990లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి సరస్వతీ అమ్మవారికి నిత్య పూజలు జరుగుతున్నాయి.

### వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

13న మంగళవారం రోజున అమ్మవారికి విశేష పూజలతో పాటు అమ్మవారికి పల్లకీసేవను నిర్వహిస్తారు. 14న బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతీ జన్మోత్సవము, చతుష్షష్టి ఉపచార పూజ, సరస్వతీ మంత్రహవనము, రథోత్సవము, ధార్మిక ప్రవచనం, వీణావాదానం, ప్రదోష పూజ, హారతి, మంత్ర పుష్పం పూజలను నిర్వహించనున్నారు. 15 గురువారం రోజున విశేష పూజలతో పాటు బలిహరణము, పూర్ణాహుతి, తదితర తంతులను నిర్వహిస్తారు. తీర్థ ప్రసాదం, అన్న ప్రసాద వితరణం చేపడతారు. అదేవిధంగా మూడు రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం నుంచి అక్షర స్వీకారములు, కుంకుమార్చనలు, ఒడి బియ్యం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


బస్వాపూర్‌లో గుట్ట కింది భాగంలో ఉన్న భ్రమరాంభ సహిత మల్లికార్జున ఆలయం

## మల్లన్నగుట్టపై వార్షికోత్సవం

ఆలయంలోని స్వయంభూ శివలింగం

● మూడు రోజుల పాటు వేడుకలు
● నేడు కల్యాణం, పల్లకీసేవ.. 15న రథోత్సవం

వెల్దుర్తి, ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని బస్వాపూర్ కొండ కోనల్లో మల్లన్నగుట్ట వద్ద భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడకలకు ముస్తాబయ్యాయి. 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీమాధవానంద సరస్వతి దివ్య ఆశీస్సులతో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నేడు విశేష పూజ క్రతువులను, స్వామివారి కల్యాణం, పల్లకీసేవ, బోనాలు, సాంస్కృతి కార్యక్రమాలు, అఖండ భజన, 15న రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### భక్తుల పాలిట కొంగుబంగారం...

భక్తుల పాలిట కొంగుబంగారంగా మల్లికార్జునస్వామి విలసిల్లుతున్నాడు. ఈగుట్టపై రెండు శివలింగాలు ఉన్నాయి. ఒకటి స్వయంభువు కాగా, మరొకటి ప్రతిష్ఠించిన లింగం. స్వమంభులింగం కాశీక్షేత్రంలో ఉన్న భూలింగం తరహాలో ఉండటం విశేషం. కాగా ఈలింగం ఏటా వెంట్రుక మందంలో పెరుగుతుందని నమ్మకం. ఆలయంలో విఘ్నేశ్వర, పంచముఖి ఆంజనేయ, రాధాకృష్ణ, నవగ్రహ ఆలయాలు ఉన్నాయి. 1200ల సంవత్సరాల క్రితం సిద్దులు, రుషులు ఈగుట్టపై తపస్సులు చేసేవారని రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి తెలిపారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కోనేరులో స్నానం చేస్తే సకల రోగాలు మటుమాయం అవుతాయని భక్తుల విశ్వాసం. గుట్టపై ఔషధ చెట్లు ఎన్నో ఉన్నాయి. వర్షపు నీరు చెట్ల వేర్లను తాకుతూ కోనేరులోకి ప్రవహిస్తుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 75 కిలోమీటర్లు, జిల్లా కేంద్రమైన మెదక్‌కు 25, నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌కు 26, మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి 4కిలో మీటర్ల దూరంలో వెల్దుర్తి, నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన ఉంది.

## దేవుడి కృపతోనే జ్ఞానం, శక్తి లభిస్తుంది

● చినజీయర్‌స్వామి

రాయపోల్ ఫిబ్రవరి 12 : దేవుడి కృపతోనే మనకు జ్ఞానం, శక్తి లభిస్తుందని చినజీయర్ స్వామి పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ పరమాత్మ ఏ రూపం ధరిస్తే ఆ రూపంలోనే లీనమై ఉంటాడన్నారు. ప్రసాదం పెడితే ఆయన తినడు కానీ, దానిని శక్తి రూపంలో మార్చి మనకే ఇస్తాడు. భక్తితో మనం పూజించి ప్రసాదం సమర్పిస్తే ఆయన మనకు అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడన్నారు. దేవుడి ప్రసాదం తీసుకుంటే మనకు గొప్ప శక్తి లభిస్తుందిని, తెలివిని జ్ఞానాన్ని ఇస్తుందని ఆయన అంతటా ఉంటాడు కానీ మనం పూజించుకోవడానికి ఒక ఆలయాన్ని నిర్మించుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం అలవాటు చేసుకోవాలని సూచించారు. మంచి మార్గంలో నడిచినప్పుడే దేవుడి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. ముచ్చింతల్‌లోని సమతా మూర్తి ఆలయం వద్ద ఈ నెల 20 నుంచి పది రోజుల పాటు సమతా కుంభ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపను పొందాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆయుష్ కమిషనర్ డాక్టర్ అట్ల రాజేందర్‌రెడ్డి, దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు అట్ల రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ పిట్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


అనుగ్రహభాషణం చేస్తున్న చినజీయర్ స్వామి



విద్యార్థులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగ్రవాల్

## అంగడి కిష్టాపూర్ బడి ఆదర్శం

● అభినందించిన అదనపు కలెక్టర్ గరిమాఅగ్రవాల్

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12: మర్కూక్ మండలంలోని అంగడి కిష్టాపూర్ బడి ఆదర్శమని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను నడపడం అభినందనీయమని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగ్రవాల్ పేర్కొన్నారు. అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల వారీగా పాఠశాలలో అమలవుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించి పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్న విద్యార్థులతో సంభాషిస్తున్న సమయంలో ఇద్దరు యూకేజీ విద్యార్థులు దేశంలోని అన్నిరాష్ట్రాలు, వాటి రాజధానులు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను తడబడకుండా చెప్పి అధికారులను అబ్బుర పరిచారు. అనంతరం అదనపు కలెక్టర్ ఇరువురు విద్యార్థులను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో కౌసల్యాదేవి, డీఎల్పీవో వేదవతి, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీవో రాజలింగం, పంచాయతీ కార్యదర్శి నీలిమ, ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కూడవెల్లి హుండీ ఆదాయం రూ.2.7లక్షలు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 12: అక్బర్‌పేట-భూంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయ జాతర హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో విశ్వనాథశర్మ మాట్లాడుతూ.. మూడురోజులుగా జాతరకు వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 2,70,509 ఆదాయం సమకూరిందని వివరించారు.

# రోడ్డు పక్కనే బావి.. వాహనదారులకు రక్షణేదీ?

● విస్తరణ పనుల్లో రక్షణ చర్యలను విస్మరించిన అధికారులు ● అప్పలాయచెరువు మూలమలుపులో ప్రమాదకరంగా వ్యవసాయ బావి

నంగునూరు, ఫిబ్రవరి 12: రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న బావులకు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పాలమాకుల నుంచి అప్పల చెరువు మీదుగా నర్మెట్టకు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. అప్పలాయ చెరువు పెద్దమ్మ గుడి కమాన్ దగ్గర మూలమలుపులో రోడ్డు పక్కన పాత వ్యవసాయ బావి ఉన్నప్పటికీ దానికి రక్షణ గోడ ఏర్పాటు చేయలేదు. గతంలో ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఆ బావిలోకి దూసుకెళ్లగా డ్రైవర్ అప్రమత్తమై పక్కకు దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. అంతేకాకుండా ఈ బావి కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. రహదారుల విస్తరణ చేపట్టిన అధికారులు ప్రమాదకర వ్యవసాయ బావులను విస్మరించడం తగదని విమర్శించారు. ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ మూలమలుపు వద్ద ఉన్న బావిని పట్టించుకోకపోవడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.



అప్పలాయచెరువు మూల మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి

కనీసం బావి ఉన్న ప్రదేశంలో సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర బావుల నుంచి వాహనదారులకు రక్షణ చర్యలను చేపట్టి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.




శిక్షణ కేంద్రం ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్ననరేందర్

## మహిళలు స్వశక్తితో జీవనోపాధి పొందాలి

కొండపాక, ఫిబ్రవరి 12: మహిళలు స్వశక్తితో ఉపాధి పొందాలని పీఎన్ఆర్ సేవాసంస్థ చైర్మన్ పోల్కంపల్లి నరేందర్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. కుకునూరుపల్లిలో సోమవారం నాబార్డు సహకారంతో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్క్, ఫాబ్రిక్ పెయింటింగ్‌పై ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 30మంది మహిళలకు 20 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనంతో పాటు రూ.1000 స్టైఫండ్ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ రాజలింగం వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తో పాటు బ్యాంకులు, సెర్ప్ ద్వారా రుణ వసతి అందించి వారు సొంతంగా జీవనోపాధి పొందడానికి స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయంతి నరేందర్, వెలుగు సీసీ లింగం, వీవో లీడర్లు, వీవోఏలు స్వయం సహాయక గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

## గుండంలో స్నానానికి వెళ్లిన వ్యక్తి మృతి



శివకుమార్ (ఫైల్)

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 12: స్నానం చేసేందుకు వెళ్లిన వ్యక్తి గుండంలో మునిగి మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో చోటు చేసుకున్నది. సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన దాసరి శివకుమార్(19) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 10వ తేదీన పుల్లూరు బండ జాతరకు వెళ్లిన శివకుమార్ గుండంలో స్నానానికి దిగాడు. అప్పటికే మద్యం సేవించి ఉండటంవల్ల గుండంలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఒక్కడే జాతరకు వెళ్లడం వల్ల అతడు గుండంలో మునిగిపోయిన విషయాన్ని ఎవరూ గమనించలేదు. సోమవారం ఉదయం మృతదేహం గుండంలో పైకి తేలింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

మద్దూరు, ఫిబ్రవరి 12: మండలకేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు గ్రామానికి చెందిన బాధితుడు మహమ్మద్ కరీముద్దీన్ ఈ నెల 10న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కల్సి హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులకు వేసిన తాళం తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు సెల్‌ఫోన్లు, 3 ట్యాబ్‌లు, రిస్ట్ వాచ్‌లు, రేబాన్ గ్లాసెస్ చోరీ జరిగినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అప్పగింత



బాధితులకు సెల్ ఫోన్లను అప్పగిస్తున్న సీఐ ఎర్రల కిరణ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 12: పోగొట్టుకున్న నాలుగు సెల్ ఫోన్లను సోమవారం బాధితులకు అప్పగించినట్లు హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ తెలిపారు. హుస్నాబాద్, కోహెడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని కూడిమేత గీత, లావుడ్య హరిలాల్, ఆవుల అభిలాష్, గీకురు శ్రీకాంత్ 15 రోజుల క్రితం వివిధ ప్రదేశాల్లో తమ ఫోన్‌లను పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఇఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ల ఆచూకీని కనిపెట్టారు. ఫోన్‌లు దొరికిన వ్యక్తుల నుంచి వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్టు తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ తోట మహేశ్, సిబ్బంది ఉన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

నారాయణరావుపేట, ఫిబ్రవరి 12: అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని నారాయణరావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఐకేపీ మార్కెట్ సమీపంలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు రాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది సోమవారం కూల్చివేసినట్టు తెలిపారు. పంచాయతీ పరిధిలో నిర్మాణం చేపట్టేవారు ముందస్తుగా వారి ఇంటి నిర్మాణం స్థలానికి సంబంధించిన కాగితాలతో అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం



శ్రీగిరిపల్లిలో పలువురిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు సోమవారం నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని, వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. వారితో కాంగ్రెస్‌పార్టీ నాయకులు నెంటూరు కుమార్, కరుణాకర్, పెద్దోళ్ల నర్సయ్య, పొట్ట కృష్ణ, కృష్ణ తదితరులున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 12: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, ఆటుపోట్లను దాటి పుంజుకుంటామని తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు అన్ని కమిటీలను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, కొంకటి నళినీదేవి, నాయకులు తదితరులున్నారు.

## సిద్దిపేటలో ఉచిత వైద్యశిబిరం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 12: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సురభి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేటలోని టీహెచ్ఆర్ నగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కొండం కవితా సంపత్‌రెడ్డి, సురభి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ పీఆర్వో పరశురాములు మాట్లాడుతూ శిబిరంలో సుమారు 420మందికి పైగా పరీక్షలను నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ జనరల్ సర్జన్ ఆర్థోపెడిక్ స్త్రీల వైద్య నిపుణులు కంటి చిన్నపిల్లల వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నిరంతర నిఘా: సీఐ

మద్దూరు, ఫిబ్రవరి 12 : సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందని, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. సోమవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నిర్వహించిన నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. గ్రామానికి చెందిన హార్డ్‌వేర్ షాపు యజమాని ముతలిబ్ తన షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నందుకు అభినందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్‌యూనస్ అహ్మద్‌అలీ ఉన్నారు.

## 'ఉదయసాహితీ' రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కాంతికృష్ణ



కాంతికృష్ణ

చేర్యాల, ఫిబ్రవరి 12 : ఉదయసాహితీ సాహిత్య వికాసవేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చేర్యాల పట్టణానికి చెందిన గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ నియామకమయ్యాడు సాహిత్య రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో చోటుకల్పించినట్లు ఉదయ సాహితీ సాహిత్య వికాసవేదిక ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## గిరిపల్లిలో కేంద్ర ప్రభుత్వం పథకాల పై అవగాహన

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని గిరిపల్లిలో సోమవారం గావ్ చలో అభియాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీజేపీ నాయకులు బండారు మహేశ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పతకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

### సీపీని కలిసిన ఎస్ఐ



సీపీ అనురాధకు మొక్కను అందజేస్తున్నఎస్ఐ బాలకృష్ణ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 12: చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన బి. బాలకృష్ణ సోమవారం సిద్దిపేట పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

### సిద్దిపేట రూరల్ ఎస్ఐగా అపూర్వరెడ్డి



సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 12: ఇటీవల జరిగిన పోలీసుల బదిలీలో భాగంగా సిద్దిపేట సీసీఆర్‌బీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గూడ అపూర్వరెడ్డి సిద్దిపేట రూరల్‌కు బదిలీ అయ్యారు. సోమవారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా పోలీసు అధికారి అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

### బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవో పట్టాభి రామారావును సన్మానిస్తున్న ఎంపీపీ బాలేశంగౌడ్

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12: జగదేవ్‌పూర్ ఎంపీడీవోగా పనిచేస్తున్న పట్టాభి రామారావు నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయనకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, జూనియర్ అసిస్టెంట్ అనిత, కార్యదర్శులు ఉన్నారు.

### మహిళా సంఘాలకు పారిశుధ్యంపై అవగాహన

మద్దూరు, ఫిబ్రవరి 12: మండలంలోని రేబర్తి గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పారిశుధ్య కార్యక్రమాలపై పంచాయతీ సెక్రటరీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెక్రటరీ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తడి పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరు చేయు విధానంపై అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం, మంగళవారం డ్రై డేను పాటించాలన్నారు.కార్యక్రమంలో వీవో సీఏ జయమ్మ, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ బడ్జెట్



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాసంక్షేమ బడ్జెట్ అని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు చెన్నై భూపాల్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాసంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేశం, సుదర్శన్, ప్రభాకర్, భూమాగౌడ్, వెంకట్‌గౌడ్ తదితరులున్నారు.

# పంటలకు సాగునీరందించాలి



చిన్నకోడూరు: ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న రైతులు



నంగునూరు: నీటిపారుదలశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 12: చెరువులు, కుంటలు నింపి పంటలకు సాగు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చిన్నకోడూరు, గంగాపూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు సోమవారం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టు వద్ద గల ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా చిన్నకోడూరులోని బెల్లంకుంట, కర్నాలకుంట, గంగాపూర్‌లోని కుంటల్లోకి నీటిని వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్ల కాలువలను నిర్మించి చెరువులు, కుంటలను నింపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అనంతరం రైతులు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

● **నంగునూరు:** రంగనాయకసాగర్ రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నీటిపారుదల శాఖ కార్యాలయంలో డీఈ చంద్రశేఖర్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వాగులు, బోరు బావులు అడుగంటి పోవడంతో తమ పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటిని విడుదల చేస్తే తమ పొలాలను కాపాడుకునే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్‌శాఖ డిప్యూటీ ఈఈ చంద్రశేఖర్ స్పందించి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు సత్యనారాయణ రెడ్డి, రాజేశ్వర్, వెంకటరామిరెడ్డి, సుధాకర్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు, కుంటల లీజు పన్ను రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందిస్తున్న మత్స్యకార్మిక సహకార సంఘం నాయకులు

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12: నియోజక వర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో చెరువులు, కుంటలపై ప్రభుత్వం పెంచిన లీజు రకం పన్నును పూర్తిగా రద్దు చేసి మత్స్య కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా మత్స్యకార్మిక సహకార సంఘం డైరెక్టర్ పెండెల అయిలయ్య, హుస్నాబాద్ పట్టణ మత్స్యకార్మిక సహకార సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి రాగుల శ్రీనివాస్, చౌటపల్లి గ్రామ సహకార సంఘం అధ్యక్షుడు గంగాధర రాజయ్య సోమవారం ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల పరిధిలో గల చెరువులు, కుంటల్లో చేపల పెంపకం కోసం లీజుకు తీసుకుని జీవిస్తున్నారని, అయితే ప్రభుత్వం పెంచిన లీజు పన్నుతో మత్స్యకార్మికులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో చెరువు, కుంటకు రూ. 4 వేల నుంచి 6 వేల వరకు పెంచడంతో చేపల ఉత్పత్తి లేక అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీల పరిధిలోని కుంటలకు రూ 300 వరకు లీజు పన్ను తగ్గించాలని డిమాండ్ చేశారు. చెరువులు, కుంటలు నీరు లేక అడుగంటి పోతున్నాయని ఎండిపోయిన చెరువులు, కుంటలకు లీజు పన్ను పూర్తిగా తగ్గించి మత్స్యకారులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో ఎండిపోయిన చెరువులు, కుంటలను సర్వే చేసి మత్స్యశాఖ ఏడీఏకు రెవెన్యూ అధికారులు నివేదిక సమర్పించాలని మత్స్యకార్మిక సహకార సంఘాల నాయకులు పెండెల అయిలయ్య, రాగుల శ్రీనివాస్, గంగాధరి రాజయ్య కోరారు.

# ప్రమాదాల నివారణలో యువతే కీలకం

గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 12: రోడ్డు ప్రమాదాల నివారణలో యువతదే కీలకపాత్ర అని ప్రొఫెసర్ మీలా శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో రోడ్డుప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, నిమిషానికి ఒకటి చొప్పున జరుగుతున్నాయన్నారు. పదేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాద మృతుల్లో 50శాతానికి పైగా యువతే ఉన్నట్టు చెప్పారు. ప్రమాదాలను నివారించేందుకుగానూ కేంద్ర రవాణాశాఖ ఏటా ఫిబ్రవరి 2వ వారంలో ప్రత్యేకంగా రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించి, యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేలా చేసిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు



విద్యార్థులకు రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీధర్

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. వారితో ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, అకాడమిక్ కోఆర్డినేటర్ బాలరాజు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రమేశ్‌బాబు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ భవాణి, విజయభాస్కర్, రాంచంద్రం, పెద్దిరాజు, మార్కండేయ, కవిత, లక్ష్మీనరసయ్య, నవీన్, శివ ఉన్నారు.



అరుణహవనం నిర్వహిస్తున్న రుత్వికులు

## సాంద్రానందాశ్రమంలో ఘనంగా పాదపూజ

చేర్యాల, ఫిబ్రవరి 12: కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలోని ఆధ్యాత్మిక క్షేత్రం సాంద్రానందాశ్రమంలో కొనసాగుతున్న పాదపూజ మహోత్సవ వేడుకలు రెండవరోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, మండపస్థానపూజ, వాస్తుయోగిని, ద్వాదశ లింగతోభద్ర మండల దేవతాయజనం, చతురాయతన దేవతాసహిత ఆదిత్యాత్మక రుద్ర కలశ స్థాపన, స్థాపిత దేవాయజనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గణపతికి సహస్ర మోదక హవనం, అరుణ హవనం నిర్వహించారు. పాదపూజ వేడుకలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సోమవారం హాజరై సాంద్రానందస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## గుండారెడ్డిపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

కోహెడ, ఫిబ్రవరి 12: కోహెడ మండలం గుండారెడ్డిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకొని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుతారి కళ్యాణి, మాజీ సర్పంచ్ కనుకరాజు తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 19న శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హిందూవాహిని సంయోజక్ నాయకులు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 12: ఈ నెల 19న సిద్దిపేటలోని వెంకటేశ్వరాలయం వద్ద హిందూవాహిని ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు హిందూ వాహిని సంయోజక్ బసవరాజు సత్యం పేర్కొన్నారు. సోమవారం ఆయన సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో హిందూవాహిని రాష్ట్ర నాయకుడు భూమిరెడ్డి తో కలిసి శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠకు సంబంధించిన కరపత్రిక, పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 19 సాయంత్రం రేణుకామాత ఆలయం నుంచి వేంకటేశ్వర ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించ తల పెట్టామన్నారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా సహ సంయోజక్ బండి కిరణ్‌కుమార్, జిల్లా నిధి పరశురాములు, శ్రీకాంత్, పట్టణ సంపర్క ప్రముఖ్ రాజు, ఎలక్ట్రికల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ప్రశాంత్, సిద్దిపేట నగర సహ సంయోజక్ మ్యూజిక్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

బెజ్జంకి, ఫిబ్రవరి 12 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృష్ణా జలాలపై నల్గొండలో తలపెట్టిన బహిరంగ సభను నిరసిస్తూ బెజ్జంకి మండల కేంద్రంలో కిసాన్ సెల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్న పదేళ్లపాటు పాలమూరు ప్రాజెక్టుపై వివక్ష చూపిని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు 2015లో శంకుస్థాపన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంతవరకు ప్రాజెక్టు పనులను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. కృష్ణానదిలో నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తీసుకు వెళ్తున్నా ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. నీటి వాటాలో తెలంగాణకు అన్యాయం చేసి, తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు రొడ్డ మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నరసయ్య, శ్రవణ్, వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా మార్కండేయ జయంతి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 12: పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం మార్కండేయ జయంతి సందర్భంగా నిర్వాహకులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సతీష్, మఠం శివకుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో మూల విరట్‌కు పంచామృతాభిషేకాలు చేసి పూలతో పట్టువస్త్రాలతో స్వామివారిని అలకరించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పూలతో అలకరించిన వాహనంపై మార్కండేయ పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గజ్వేల్ పురవీధుల్లో ఊరేగించారు. భాజా బజంత్రీల మధ్యన భక్తుల శివనామ స్మరణతో ఇందిరాపార్కు చౌరస్తా వరకు ఊరేగింపు కొనసాగింది. ప్రత్యేక వస్త్రధారణతో భక్తులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తలకొక్కుల భాగ్యలక్ష్మి, నిర్వాహకులు దేవులపల్లి రాజారం, దొంతుల ప్రభాకర్, గాడిపల్లి శ్రీనివాస్ కాముని మురళీ,ఆంజనేయులు,దుర్గం, పూలసత్యం తదితరులు పాల్గొన్నారు.



మంగళహారతులతో రథానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

● **దుబ్బాక:** దుబ్బాకలో మార్కండేయ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాదవనేని రఘునందన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● **కోహెడ:** మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగేశ్వరి, శ్రీకాంత్, రాజేశం, పద్మశాలీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.